క్లుప్తంగా

జల కళ



నీటితో కళకళలాడుతున్న ఆసర్లసాగరం

పాతపట్నం: మండలంలో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో తెంబూరు ఆసర్లసాగరం నీటితో కళకళలాడుతోంది. ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆసార్లసాగరం నిండితే పాతపట్నం, టెక్కలి, నరసన్నపేట నియోజకవర్గాల్లో సుమారు 2,600 ఎకరాలకు పైగా సాగు నీరందిస్తోంది. అసర్లసాగరం 750 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంది. ప్రభుత్వం అసర్లసాగరాన్ని రిజర్వాయర్‌గా స్థాయిని పెంచితే ఈ పరిసర ప్రాంత ప్రజలకు ఏడాది పొడవునా పంటలు పండించుకొనేందుకు సాగునీరు అందుబాటులోకి వస్తుందని రైతులు అంటున్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

నరసన్నపేట: మండల కేంద్రంలో ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వృద్ధాశ్రమంలో ఉన్నవారికి, పట్టణంలో చెప్పులు కుట్టేవారికి నరసన్నపేట కమిటీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు దేవ్, తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: మండల కేంద్రంలో పలువురు రైతులకు ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ ఎస్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో యూనిట్ ఇన్‌చార్జి రమణమ్మ అవగాహన కల్పించారు. ద్రవజీవామృతానికి అవసరమైన వస్తువులు, ఏ మోతాదులో కలిపి తయారుచేయాలన్న అంశాలపై శిక్షణ ఇచ్చారు. అన్ని రకాల మిశ్రమాన్ని కలిపిన తరువాత ఆరో రోజు జీవామృతం తయారవుతుందన్నారు. ఈ విధంగా 400 లీటర్ల జీవామృతం తయారు చేయడం జరిగిందన్నారు. జీవామృతం వినియోగించే పద్ధతితోపాటు వినియోగించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

బూర్జ: నాగావళి నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక తహసీల్దార్ వై.వి.పద్మావతి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడుతున్నందున నాగావళి నదికి వరదలు వచ్చే ప్రమాదం ఉందని, లోతట్టు గ్రామాల ప్రజలు నది వైపు వెళ్లకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. మట్టి గోడలు, పూరిళ్లలో నివసించేవారు ప్రభుత్వ కార్యాలయాల్లోకి, పక్కా భవనాల్లోకి వెళ్లాలని గ్రామాల్లో దండోరా ద్వారా అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

మండల సమావేశం రేపు

పాతపట్నం: ఈ నెల 19వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ టి.చంద్ర కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

సేవలకు గుర్తింపు



సర్వేశ్వరరావును సన్మానిస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఆమదాలవలస: సమాజ సేవ చేసిన వారికి గుర్తింపు లభిస్తుందని శ్రీమద్విరాట్ విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం సీనియర్ వాచ్ మెకానిక్, కళాకారుడు మండా సర్వేశ్వరరావును యూనియన్ తరఫున సత్కరించారు. ఆయన సమాజానికి అందించే సేవలకు గుర్తింపుగా సన్మానం చేసినట్లు విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కుప్పిలి చంద్రమౌళి, గౌరవ కార్యదర్శి దుప్పలపూడి శ్రీనివాసరావు ఆచారి, నాయకులు టి.ధనుంజరావు, శ్రీనివాసరావు, ఎం.వి.రమణమూర్తి, కామేశ్వరరావు, మంతెన రాజాజీ, తదితరులు పాల్గొన్నారు.



తొగరాం గ్రామం వద్ద అధ్వానంగా ఉన్న రహదారి



ముద్దాడపేట మలుపు వద్ద రాళ్లుతేలిన రహదారి

అంతా గోతులమయం



కలివరం గ్రామం వద్ద ఏర్పడిన గోతులు



పీర్‌సాహెబ్‌వానిపేట వద్ద రహదారి దుస్థితి



దూసిపేట వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

- ఇసుక అక్రమ రవాణాతో చిత్తడి.. చిత్తడి
- అధ్వానంగా మారిన రహదారి
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ఆమదాలవలస రూరల్: మండల పరిధిలోని నాగావళి నది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండడంతో దూసి నుంచి నిమ్మతొర్లివాడ రహదారి అధ్వానంగా మారింది. గత రెండు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా మరింత దారుణంగా తయారైంది. ఈ రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది.

చెరువులను తలపిస్తున్న గోతులు..

దూసి నుంచి నిమ్మతొర్లివాడ రహదారి సుమారు 20 కిలో మీటర్ల మేర ఉంది. ఈ రహదారిలో 30 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ముఖ్యంగా దూసి, ముద్దాడపేట, కలివరం, తొగరాం, దూసిపేట తదితర గ్రామాల వద్ద పెద్ద, పెద్ద గోతులు ఏర్పడటంతో చెరువులను తలపిస్తున్నాయి.

మరో రహదారిలో ప్రయాణం..

ఈ రహదారిపై వాహనాలు కూడా వెళ్లేందుకు అవకాశం లేని విధంగా గోతులు ఏర్పడటంతో కొందరు వాహనదారులు మరో మార్గంలో ప్రయాణాలు సాగించాల్సి వస్తోంది. శ్రీకాకుళం పట్టణానికి వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి. వాహనాలు వెళ్లేందుకు అనుకూలంగా లేకపోవటంతో ముద్దాడపేట నుంచి కనుగువలస మీదుగా ఆమదాలవలస ఫ్లై ఓవర్‌కు చేరుకొని అక్కడ నుంచి వెళ్లాల్సి వస్తోంది. దూరం కూడా ఎక్కువ కావటంతో చార్జీలు గిట్టుబాటు కావటంలేదని కొందరు ఆటో వాలాలు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని నాగావళి నదీతీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడ్డుకట్ట వేయాలి..



ఇసుక అక్రమ రవాణా చేయటం వల్ల రహదారి పూర్తిగా పాడైంది. దీంతో రాకపోకలు సాగించలేక అనేక అవస్థలు పడుతున్నాం. రహదారి అధ్వానంగా ఉండటం వల్ల రాత్రిపూట ప్రయాణం మరింత ఇబ్బందిగా ఉంది. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి.

– ఊడికల రాజబాబు, కలివరం గ్రామం, ఆమదాలవలస మండలం

ప్రమాదకర స్థితిలో చెరువు గట్టు



సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపురం గ్రామంలో గల కామినాయుడు చెరువు గట్టు కరిగిపోయి ప్రమాదకర స్థితిని తలపిస్తోంది. దీంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు గట్టు మట్టి కరిగిపోయి బీటలు వారింది. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ చెరువు ద్వారా మూలసవలాపురం, సింధువాడ, మర్రిపాడు, తురకపేట, ఇస్కలపాలెం గ్రామాలకు చెందిన సుమారు 200 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతోంది. కుడి ప్రధాన కాలువ ద్వారా వచ్చిన నీటితో చెరువు నిండుగా ఉంది. ఏక్షణమైనా చెరువుకు గండిపడే ప్రమాదముందని దిగువ భాగాన నివాసముంటున్నవారు ఆందోళన చెందుతున్నారు.

– సరుబుజ్జిలి

కుక్కల బెడద..



ఆమదాలవలస పట్టణంలో బి.ఆర్.నగర్‌లో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పురపాలక సంఘం అధికారులు కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– ఆమదాలవలస రూరల్

చెరువును తలపిస్తున్న రహదారి



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట–సరుబుజ్జిలి ప్రధాన రహదారిలో బుడ్డివలస వద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా ఉన్న పరిస్థితి. ఏమాత్రం వర్షం కురిసినా గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. అధికారులు స్పందించి రహదారిని బాగు చేయాలని బుడ్డివలస గ్రామస్తులు కోరుతున్నారు.

– సరుబుజ్జిలి

పాడైన విత్తనాలు!



సారవకోట మండల కేంద్రంలోని అటవీ శాఖ సెక్షన్ అధికారి కార్యాలయంలో కరక్కాయల విత్తనాలు కొన్నేళ్లుగా మూలుగుతున్నాయి. గతంలో రిజర్వ్ ఫారెస్టు ఏరియాలో ఈ విత్తనాలు వేయాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఈ విత్తనాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయకపోవడంతో ఇప్పటికీ సెక్షన్ అధికారి కార్యాలయంలోనే ఉన్నాయి. ప్రస్తుతం ఇవి పూర్తిగా పాడై ఉంటాయని, ఇక్కడి సెక్షన్ అధికారి కార్యాలయం సైతం తెరుచుకునే దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– సారవకోట

వామ్మో.. వానరాలు..!



టి.కె.ఆర్.పురంలో సంచరిసున్న కోతులు



టి.కె.ఆర్.పురంలో ఓ ఇంటిపై సంచరిస్తున్న వానరం

- తూముకొండలో వందల సంఖ్యలో కోతుల సంచారం
- ఇళ్లల్లో చొరబాటు..
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని పరశురాంపురం పంచాయతీ పరిధిలోని తూముకొండ రామచంద్రాపురం (టి.కె.ఆర్.పురం), రంగడిఘాటి తదితర గ్రామాల్లో వందల సంఖ్యలో వానరాలు సంచరిస్తున్నాయి. ఎక్కడ చూసినా వానరాలే కనిసిస్తు ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా అధిక సంఖ్యలో కోతులు కనబడటంతో.. ఎక్కడినుంచో వాహనంతో తెచ్చి విడిచిపెట్టినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. చిన్న, చిన్న కోతి పిల్లలకు కొంత మంది స్థానికులు ఆహారం అందిస్తున్నారు. పగలే ఇళ్లల్లోకి వస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పంటలు నాశనం..

చుట్టు పక్కల ఉన్న పోడు వ్యవసాయ, కూరగాయల పంటలను నాశనం చేస్తున్నాయి. చిన్నపిల్లలు బయట కనిపిస్తే వెంబడిస్తూ ఇబ్బంది పెడుతున్నాయి. తోటల్లో, వీధుల్లో, పొలాల్లో ఎక్కడికక్కడే సంచరిస్తున్నాయి. కొద్దిరోజుల వరకు గ్రామాలకు సమీపంలో సంచరిస్తూ ఉండేవి. ప్రస్తుతం గ్రామాల్లోకి వచ్చి అవస్థలకు గురిచేస్తున్నాయి. దీనిపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. కనీసం ఫారెస్ట్ అధికారులు ఈ విషయాన్ని బాధ్యతగా తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఫారెస్ట్ రేంజర్ అమ్మన్నాయుడును సాక్షి విలేకరి సంప్రదించడానికి ప్రయత్నిస్తే.. ఫోన్‌కు కూడా అందుబాటులో లేరు.

అధికారులు పట్టించుకోవడంలేదు..



రెండు నెలల క్రితం వందల సంఖ్యలో కోతులు మా గ్రామ పంచాయతీలో కనిపించాయి. ఎలా వచ్చాయో.. ఎవరు తెచ్చి విడిచిపెట్టారో తెలీదు. అప్పటినుంచి ఫారెస్ట్, రెవెన్యూ అధికారుల దృష్టిలోకి తీసుకెళ్లాం. వారు పట్టించుకునే దాఖలాలు లేవు. నా సొంత ఖర్చుతో బోను తయారు చేయిస్తున్నాను. అధికారులు సహకరించాలి.

– తెంబూరు ప్రసాదరావు, సర్పంచ్, పరశురాంపురం

ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా?



రెండు నెలలుగా అవస్థలు పడుతున్నాం. ఒకేసారి వందల్లో కోతులు వచ్చి మా గ్రామంలో తిరుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చిన్నపిల్లలపై దాడి చేస్తాయేమోనని భయపడుతూ ఉన్నాం. ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోతేగాని స్పందించరేమో మరి. కోతుల బెడద తగ్గించాలి.

– గేదెల గౌరమ్మ, తూముకొండ గ్రామం

పయత్నాలు చేస్తున్నాం..

ఒకటి, రెండైతే మేము పట్టుకోగలం. వందల సంఖ్యలో ఉండటం వలన మేం పట్టుకోలేకపోతున్నాం. యూట్యూబ్‌లో కోతులు పట్టేవారిని చూశాం. వారు నెల్లూరులో ఉన్నారు. వారు వస్తే కోతులను పట్టుకుంటారు.

– గద్ది ప్రవీణ్, జాడుపల్లి, గార్డ్

‘కూటమి పాలన మోసాలమయం’



ఆమదాలవలస: కాలేజీ ఎదురు వీధిలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ఆమదాలవలస: ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయండా ప్రజలను మోసం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ 13వ వార్డు కాలేజీ వీధి, కిల్లివారి క్వార్టర్స్, కోర్టు ఎదురు వీధుల్లో వార్డు నాయకుడు దుంపల శ్యామలరావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను అందించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు దుంపల చిరంజీవిరావు, చింతాడ వెంకటరమణ, సాదు కామేశ్వరరావు, బి.వి.రమణమూర్తి, నున్నగాపుల చిన్నారావు, మామిడి రమేష్, లక్ష్మీనారాయణ, సనపల సురేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఆమదాలవలస మండలంలో జీకేవలస, కొరపాం గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమానికి చింతాడ రవికుమార్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, చిగురుపల్లి ధనలక్ష్మి, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిరమండలం: కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని విస్మరించిందని, శాంతిభద్రతను గాలికి వదిలేసిందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ అన్నారు. పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదేశాల మేరకు మండలంలోని ఎం.ఎల్.పురం, లోకొండ పంచాయతీల పరిధిలోని భగీరిథిపురం, భగీరథిపురం కాలనీ, మామిడిజోల గ్రామాల్లో సర్పంచ్ వి.చిరంజీవి, మాజీ సర్పంచ్ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫేస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను వివరించి క్యూ ఆర్ కోడ్‌ను అందించారు. పార్టీ నాయకులు బెవర గంగాధరరావు, లుకలాపు ప్రసాదరావు, శిమ్మ పాపయ్య, మీసాల రామారావు, బూడి ఆదినారాయణ, సవర నారాయణ, దాలయ్య, తదితరులు పాల్గొన్నారు.



భగీరథిపురం కాలనీలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న నాయకులు

దివ్యాంగ పింఛన్లు రద్దు చేయడం అన్యాయం



మాట్లాడుతున్న సిర్ల ప్రసాదరావు

కొత్తూరు: అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్ అన్నారు. కొత్తూరులో పలువురు దివ్యాంగులతో కలిసి ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఇటీవల పింఛన్ల రీ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులైన వారి పింఛన్లను రద్దు చేయడం తగదన్నారు. చాలామంది పింఛన్ డబ్బులతోనే జీవిస్తున్నారన్నారు. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న చాలా మంది దివ్యాంగులకు ఏడాది పాలన పూర్తయినా కూటమి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయకుండా.. ఇప్పుడు అనర్హత పేరుతో ఉన్న పింఛన్లను రద్దు చేయడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కొత్తూరు మండలంలోని 27 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 400 పింఛన్లను రద్దు చేసినట్లు తెలిసిందన్నారు. రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరిచాలని, లేనిపక్షంలో భవిష్యత్‌లో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

భారీ వర్షం



పాతపట్నంలో కురుస్తున్న వర్షం

పాతపట్నం: మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. పంట పొలాలు వర్షం నీటితో చెరువులను తలపిస్తున్నాయి. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, ఆర్.ఎల్.పురం, సరాలి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

చెరువు కాదు.. రోడ్డే..



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

కొత్తూరు: తుఫాన్ కారణంగా మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు నివగాం గ్రామంలోని పట్నాల వీధి వద్ద పీహెచ్ రోడ్డు చెరువును తలపిస్తోంది. రోడ్డులో ఏర్పడిన భారీ గోతుల్లో వర్షం నీరు చేరింది. రోడ్డుకు ఇరువైపులా మురుగునీటి కాలువలు లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో ప్రమాణికులు నరకం చూస్తున్నారు. రోడ్డును బాగు చేయాలని, కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నారు.

19న ఉచిత వైద్య శిబిరం

పొందూరు: ఈ నెల 19వ తేదీన స్థానిక సత్యసాయి సేవా మందిరంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రాధాకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఉంటుందన్నారు. బీపీ, సుగర్, ఈసీజీ, 2డీ ఎకో, తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరామర్శ..



శంకరరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని అన్నంపేట గ్రామానికి చెందిన కొరికాన శంకరరావు అనారోగ్యంతో గతకొద్ది రోజులుగా బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆదివారం అన్నంపేట వెళ్లి పరామర్శించారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మామిడి కిరణ్‌కుమార్, పార్టీ నాయకులు సున్నగొప్పల రామకృష్ణ, దేవకోట ఈశ్వరరావు, బాలరాజు, తదితరులు ఉన్నారు.